సాక్షి
యాదాద్రి భువనగిరి

మంగళవారం । 3 । జూన్ । 2025



యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరి క్షేత్రానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. సోమవారం సుమారు 35 వేల మంది దర్శించుకున్నారు. - IIలో



పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. - IIIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38°/27°

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

సాక్షి, యాదాద్రి: జిల్లాలో మంగళవారం నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి 20వ తేదీ వరకు 18 రోజుల పాటు 318 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారు. ధరణి పోర్టల్‌లో పరిష్కారంకాని సమస్యలను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. వాటి ఆధారంగా దరఖాస్తు ఫారాలు సిద్ధం చేసింది. సమస్యలున్న రైతులకు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు ఫారాలు అందజేస్తారు. భూ యజమానులు వాటిని నింపి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. అదే విధంగా సాదాబైనామాలకు పరిష్కారం చూపున్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాశివుడికి సంప్రదాయ పూజలు



శివాలయంలోని స్పటిక లింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి అనుబంధ క్షేత్రమైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖ మండపంలోని స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలోనూ సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామును సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలకు అభిషేకం, అర్చన, ప్రాకార మండపంలో సుదర్శన హోమం, గజవాహనసేవ, స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం నిర్వహించారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు నల్లగొండ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21లోగా iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

త్యాగాల ఫలమే తెలంగాణ



కలెక్టరేట్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో జాతీయ పతాకం ఎగురవేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సుఖేందర్‌రెడ్డి

> అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కలసికట్టుగా సాగుదాం. నిరంతరం శ్రమించి యాదాద్రి భువనగిరి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుపుదాం.
>
> – శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

అమరుల ఆశయ సాధనకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన

- తెలంగాణను ప్రపంచస్థాయిలో అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతర కృషి
- సమన్వయంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుదాం
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

సాక్షి, యాదాద్రి: ఎన్నో ఏళ్ల పోరాటాలు, ఎంతోమంది త్యాగాల ఫలితంగానే స్వరాష్ట్ర కల సాకారమైందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అనేక దశల్లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది ప్రాణాలు అర్పించారని పేర్కొన్నారు. వారి ఆశయ సాధనకు అనుగుణంగా ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రపంచస్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నిరంతర కృషి చేస్తున్నారని తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి, మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావుతో కలిసి పోలీసుల ఫ్లాగ్ మార్చ్ తిలకించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతిపై ప్రసంగించారు.

ప్రసంగంలోని ప్రధాన అంశాలు ఇవీ..

- మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు కోటి 30 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో రూ.65.92 కోట్ల విలువగల ఉచిత ప్రయాణం.
- జిల్లాలో 1,25,910 మందికి గ్యాస్ సిలిండర్లు అందజేసి రూ.17.05 కోట్ల సబ్సిడీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం.
- ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో 17 పైలట్ గ్రామాల్లో 762 మందికి ఇళ్లు మంజూరు. రెండో విడతలో 8,191 మందిని ఎంపిక.
- భూసమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టం తీసుకువచ్చాం. జిల్లాలో ఆత్మకూర్ (ఎం) మండలాని పైలట్ మండలంగా తీసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. నేటి(మంగళవారం) నుంచి జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సుల నిర్వహణ.
- రైతుభరోసా పథకం కింద మొత్తం 1,88,526 మంది రైతులకు లబ్ధి. రూ.174.11 కోట్లు వారి ఖాతాల్లో జమ.
- యాసంగిలో 375 కొనుగోలు కేంద్రాల ద్వారా 39,846 మంది రైతుల నుంచి 3,51,361 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రూ.739 కోట్లు రైతుల ఖాతాల్లో జమ.
- 515 రేషన్ షాపుల ద్వారా 2,18,963 కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. ఈ ఏడాది మార్చి నుంచి నేటివరకు 1,915 నూతన కార్డులు మంజూరు.
- ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లు మంజూరు.
- బునాదిగాని , పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల ఆధునీకరణ పనులు ప్రారంభం.
- వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, కల్లుగీత, చేనేత, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు మొత్తం 99,402 మందికి నెలకు రూ. 24.88 కోట్ల పింఛన్.
- 10వ తరగతిలో గతంలో ఎన్నడూ లేని విధంవీ విద్యా సంవత్సరం ఉత్తమ ఫలితాల సాధన. రాష్ట్ర స్థాయిలో జిల్లా ఏడవ స్థానం.
- 428 గ్రామ పంచాయతీల్లోని 719 గ్రామీణ ఆవాసాలు, ఆరు మున్సిపాలిటీల్లో 1,56,147 ఇళ్లకు నల్లాల ద్వారా గ్రామీణ నీటి సరఫరా పథకం ద్వారా తాగునీటి సరఫరా. ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ నీరు అందించేందుకు రూ.210 కోట్లతో పనులు జరుగుతున్నాయి.
- 6,771 చేనేత మగ్గాలు, 2,240 మర మగ్గాలకు జియో ట్యాగింగ్. నేతన్నకు బీమా పథకంలో 10,686 మంది చేనేత కార్మికులను చేర్పించాం.
- ఆలేరు పట్టణంలో రూ.11 కోట్ల వ్యయంతో రైల్వే అండర్ బ్రిడ్జి పనులు.
- నేరాల నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా 16,676 సీసీ కెమెరాలు ఏర్పాటు.



వేడుకల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, ఏసీపీ రాహుల్‌రెడ్డి తదితరులు



గౌరవ వందనం చేస్తున్న పోలీసులు



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

వేడుకల్లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, జెడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రేఖ, ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఉద్యోగుల జేఏసీ నాయకుడు మందడి ఉపేందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్ ప్రసాద్‌తో పాటు జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



భువనగిరిలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్, డీసీపీ

తెలంగాణ రైజింగ్ విజన్‌తో ముందుకు

తెలంగాణ రైజింగ్–2047 విజన్‌తో ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతుంది. తెలంగాణ రైజింగ్ విజన్‌లో ప్రముఖంగా పేదల సంక్షేమం, సమగ్రపాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్, పారదర్శక, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తుందని గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

6న గంధమల్లకు శంకుస్థాపన

ఆలేరు నియోజకవర్గ ప్రజల ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గంధమల్ల ప్రాజెక్టు పనులకు ఈనెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. 1.41 టీఎంసీల సామర్థ్యంతో ముంపు లేకుండా రూ.571 కోట్ల వ్యయంతో రిజర్వాయర్ నిర్మిస్తున్నాం. ప్రాజెక్టు పూర్తయితే నియోజకవర్గంలో 56 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. 50 చెరువులను నింపడానికి వీలవుతుందన్నారు.

రిజిస్ట్రేషన్‌కు ఇక నిరీక్షణ ఉండదు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు ప్రారంభం

- నూతన విధానంతో సాఫీగా సాగిన ప్రక్రియ
- తొలి రోజు 44 రిజిస్ట్రేషన్లు
- 20 నిమిషాల వ్యవధిలోనే పూర్తి

యాదగిరిగుట్ట, మోత్కూరు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్లాట్ బుకింగ్ సేవలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి వచ్చాయి. మొదటి రోజు సోమవారం నాలుగు కార్యాలయాల్లో 44 రిజిస్ట్రేషన్లు స్లాట్ బుకింగ్ ద్వారా జరిగాయి. కేవలం 20 నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ పూర్తికావడంతో పాటు డాక్యుమెంట్ సైతం చేతికొచ్చింది. నూతన విధానం ద్వారా వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ తొందరగా పూర్తవడంతో క్రయ, విక్రయదారులు సంతోషం వ్యక్తం చేశారు.

స్లాట్ బుక్‌తో జరిగిన రిజిస్ట్రేషన్లు ఇలా..

యాదగిరిగుట్టలో ఉదయం నుంచి సాయంత్రం వరకు 23 స్లాట్ బుక్ కాగా 23 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. మోత్కూరులో 6 రిజిస్ట్రేషన్లు కాగా ఇందులో మూడు సేల్ డీడ్, మూడు మార్టిగేజ్ డీడ్‌లు ఉన్నాయి. రామన్నపేటలో 3, బీబీనగర్‌లో 12 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

తప్పనున్న ఇబ్బందులు

వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్, దస్తావేజుల కోసం గతంలో రోజంతా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడేది. క్రయవిక్రయదారులు గంటల తరబడి వేచిచూడకుండా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు.



గుట్టలో స్లాట్ బుక్‌తో ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తికి డాక్యుమెంట్ అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్ వెంకట్‌రెడ్డి

ఎలాంటి సమస్యా తలెత్తలేదు

నూతన విధానం ద్వారా మొదటి రోజు రిజిస్ట్రేషన్లు విజయవంతంగా పూర్తిచేశాం. ఎటువంటి సమస్య తలెత్తలేదు. గతంలో కంటే స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ తొందరగా పూర్తికావడంతో క్రయవిక్రయదారులు సంతోషం వ్యక్తం చేశారు. గుట్టలో తొలి రోజు 23 స్లాట్‌లకు 23 రిజిస్ట్రేషన్లు సమస్య రాకుండా పూర్తి చేశాం.

–వెంకట్‌రెడ్డి, యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్

20 నిమిషాల్లోనే ముగిసింది



యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సోమవారం ఉదయం స్లాట్ బుక్ చేశా. 20 నిమిషాల వ్యవధిలోనే క్రయ విక్రయదారుల సంతకాలు, ఫొటోలు, వేలిముద్రలు తీసుకొని రిజిస్ట్రేషన్ పూర్తి చేసి డాక్యుమెంట్ ఇచ్చారు. గతంలో ఒకటి, రెండు రోజులు వేచి చూడాల్సి వచ్చేది. నూతన విధానంతో సమయం ఆదా అయింది.

–గణేష్, కొనుగోలుదారుడు, హైదరాబాద్

ఒకే రోజు స్లాట్ బుక్, రిజిస్ట్రేషన్



ఇల్లు మార్టిగేజ్ కోసం సోమవారం స్లాట్ బుక్ చేసుకున్నా ఇదే రోజు రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. డాక్యుమెంట్ తరువాత వెంటనే ఓటీపీ వచ్చింది. మొత్తం ప్రక్రియ 15నిమిషాల లోపే ముగిసింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. గతంలో రోజంతా నిరీక్షించినా రిజిస్ట్రేషన్ అయ్యేది కాదు. వివిధ సమస్యల వద్ద కనీసం రెండు, మూడు రోజులైన పట్టేది. నూతన విధానం బాగుంది.

–ఎర్రవెల్లి నాగేశ్వర్, కొండగడప, మోత్కూరు మండలం

మినీ శిల్పారామంతో భక్తులకు ఆహ్లాదం



మినీ శిల్పారామాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి



మినీ శిల్పారామంలోని చెరువులో బోట్‌లో ప్రయాణిస్తున్న ప్రభుత్వ విప్, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

భువనగిరి : యాదగిరి క్షేత్రానికి వచ్చే భక్తులు సేదదీరేందుకు మినీ శిల్పారామం ఎంతో అనువుగా ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. భువనగిరి మండలం రాయగిరి చెరువు వద్ద ఏర్పాటు చేసిన మినీ శిల్పారామాన్ని సోమవారం ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ శిల్పారామం తరహాలో మినీ శిల్పారామం ఉందన్నారు. చేనేత, హస్తకళాకారులకు సైతం తాము తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు మినీ శిల్పారామం మంచి వేదిక కానుందన్నారు. స్టాళ్లలో ఏర్పాటు చేసే చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేతను ప్రోత్సహించాలని సదర్శకులను కోరారు. అనంతరం బోటులో ప్రయాణించారు. అదే విధంగా సురభి కళాకారుల ప్రదర్శనలు, చేనేత, హస్తకళల స్టాళ్లను తిలకించారు. ఈ కార్యక్రమంలో మినీ శిల్పారామం ప్రత్యేకాధికారి కిషన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ

- భువనగిరిలోని గంజ్‌లో పరీక్ష కేంద్రం
- హాజరుకానున్న 200 మంది విద్యార్థులు

భువనగిరి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా కేంద్రంలోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక తరగతులు

వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం పెట్టుకున్న అధికారులు ఏప్రిల్‌లో ప్రకటించిన ఫలితాల్లో 97.8 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా 7వ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఫెయిలైన విద్యార్థులు సైతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. అనుత్తీర్ణులైన విద్యార్థులను సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులు దత్తత తీసుకున్నారు. వాట్సాప్ ద్వారా 20 రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ముఖ్యమైన అంశాలను బోధించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. అంతేకాకుండా ఒకే పాఠశాలలో ఎక్కువ మంది ఫెయిలైన విద్యార్థులకు వాట్సాప్ ద్వారా కాకుండా.. నేరుగా ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

'పది'లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సైకిళ్లు



సైకిళ్లతో పదో తరగతి విద్యార్థులు, చిత్రంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

భువనగిరి టౌన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 67 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సైకిళ్లు ఇస్తామని పరీక్షలకు ముందు కలెక్టర్ హనుమంతరావు ప్రకటించిన విషయం తెలిసిందే. సైకిళ్లను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, సీఎస్ఆర్ నిర్మాణ సంస్థ సహకారంతో సమకూర్చారు.



డీఈఓ సత్యనారాయణను సన్మానిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

డీఈఓకు సన్మానం

టెన్త్ ఫలితాల్లో జిల్లాను రాష్ట్ర స్థాయిలో 7వ స్థానంలో నిలిపేందుకు కృషి చేసిన డీఈఓ సత్యనారాయణను శాసనమండలి చైర్మన్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చోరీ జరిగిన ఏటీఎంను పరిశీలించిన ఎస్పీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ నరసింహ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలో చోరీ జరిగిన ఎస్‌బీఐ ఏటీఎంను సోమవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దొంగతనం జరిగిన తీరు, కేసు దర్యాప్తు వివరాలను సీఐ చరమంద రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలోకి సీసీ కెమెరాలు పరిశీలించి చోరీకి పాల్పడిన వారిని వెంటనే గుర్తించాలని పోలీసులకు సూచించారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత నెల బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించి ఏటీఎంలు, బ్యాంకుల వద్ద సెక్యూరిటీని, సీసీ కెమెరాలను బలోపేతం చేసుకోవాలని సూచించినట్లు గుర్తుచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నార్కట్‌పల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం పామనగుండ్ల గ్రామానికి చెందిన చెరుకు మహేష్(24) ద్విచక్ర వాహనంపై నార్కట్‌పల్లిలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. కూరగాయలు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా.. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని చైతన్య ఆస్పత్రి ఎదుట మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో మహేష్ పక్కనే ఉన్న డివైడర్‌కు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుడు మృతి

మోత్కూరు: ఆటో ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలం కమ్మగూడేనికి చెందిన తిప్పబత్తిని రాజయ్య(63) సోమవారం పాటిమట్ల గ్రామంలోని స్కూల్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా.. మోత్కూరు నుంచి వస్తున్న ఆటో పల్టీ కొట్టి రాజయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని భువనగిరి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

చెన్నాయిపాలెం విద్యార్థికి 238వ ర్యాంకు



భూక్యా కోటేష్

మఠంపల్లి: మండలంలోని చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన భూక్యా రవీందర్, సీతమ్మ దంపతుల కుమారుడు కోటేష్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో 238వ ర్యాంకు సాధించాడు. మారుమూల గిరిజన తండాకు చెందిన కోటేష్ అత్యుత్తమ ర్యాంకు సాధించడంతో గ్రామ పెద్దలు అభినందించారు.



నల్లగొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రదర్శించిన గృహ నిర్మాణ శాఖ శకటం



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో వ్యవసాయ శాఖ స్టాల్‌లో రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు



నల్లగొండలో రవాణా శాఖ శకటం ముందు పరేడ్ నిర్వహిస్తున్న ఆ శాఖ అధికారులు



సూర్యాపేటలో నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న శాసనమండలి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



సూర్యాపేట కలెక్టరేట్‌లో స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేటలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గురి తప్పని లక్ష్యం

- భారత ఆర్చరీ జట్టు కోచ్‌గా పుట్టపాక వాసి క్రాంతికుమార్
- చిన్నప్పుడే అతడిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన తల్లిదండ్రులు



హర్యానాలో క్రీడాకారుడికి శిక్షణ ఇస్తున్న క్రాంతికుమార్

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన దేప విష్ణవరెడ్డి, రాజ్యం దంపతుల కుమారుడు కాంత్రికుమార్ భారత ఆర్చరీ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. చిన్నప్పుడే క్రాంతికుమార్‌లోని ప్రతిభను గుర్తించిన అతడి తల్లిదండ్రులు 4వ తరగతిలోనే హైదరాబాద్‌లోని హకీంపేటలో గల తెలంగాణ స్పోర్ట్స్ పాఠశాలలో చేర్పించారు. అక్కడ పనిచేస్తున్న ఆర్చరీ కోచ్ డాక్టర్ రవిశేఖర్ ప్రోత్సాహంతో క్రాంతికుమార్ ఆర్చరీ క్రీడలో పట్టు సాధించారు. అక్కడే బీఏ పూర్తిచేసి, హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో పీజీ పూర్తిచేశారు. ఆ తర్వాత కలకత్తాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో ఆర్చరీ కోచ్‌గా డిప్లొ మా పూర్తిచేశారు. 2024లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఆర్చరీ కోచ్‌గా ఉద్యోగం రావడంతో హర్యానాలోని సోనిపట్ల ప్రాంతంలో కోచ్‌గా ఉద్యోగంలో చేరారు. ఇటీవల మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయ ఆర్చరీ జట్టు కోచ్ ఎంపికలో పాల్గొని ఈ నెల 15 నుంచి 20 వరకు సింగపూర్‌లో జరిగే ఆసియా కప్‌లో భారత ఆర్చరీ జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యారు. క్రాంతికుమార్‌కు ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి అరవింద్, కోశాధికారి సత్యప్రసాద్, నల్ల గొండ జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీగిరి విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తునిక విజయసాగర్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కామినేని, మాజీ ప్రధాన కార్యదర్శి ఈగ సంజీవరెడ్డి, కోశాధికారి పుట్ట శంకరయ్య అభినందనలు తెలిపారు.

నిరంతరం ప్రోత్సహించారు

నాలోని ప్రతిభను చిన్నప్పుడే నా తల్లింద్రడులు గుర్తించి స్పోర్ట్స్ పాఠశాలలో చేర్పించారు. నా గురువు డాక్టర్ రవిశేఖర్ నన్ను ఎంతో ప్రోత్సహించారు. రవిశేఖర్ సార్, నా తల్లిందండ్రుల ప్రోత్సాహమే నేను జాతీయ జట్టు కోచ్‌గా ఎంపికవ్వడానికి దోహదపడింది. భారత్ జట్టు విజయం సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతా.

– దేప క్రాంతికుమార్

నాణ్యమైన విత్తనాలతో దిగుబడి పెంచుకోవచ్చు



విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న ఏరువాక శాస్త్రవేత్త మధుశేఖర్

హుజూర్‌నగర్: నాణ్యమైన విత్తనాలు వాడటం వల్ల దిగుబడిని పెంచుకోవచ్చని ఏరువాక కేంద్రం నల్లగొండ జిల్లా శాస్త్రవేత్త రాజా మధుశేఖర్ అన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఎంసీ చైర్‌పర్సన్ రాధికాఅరుణ్‌కుమార్ అధ్యక్షతన 'నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజా మధుశేఖర్ పాల్గొని మాట్లాడుతూ.. విత్తనాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. నాణ్యమైన విత్తనాలు వాడితే పది నుంచి పదిహేను శాతం దిగుబడులు పెంచుకోవచ్చని ఆయన సూచించారు. అనంతరం రైతులకు విత్తన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, ఏఓ స్వర్ణ, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ పాల్గొన్నారు.

షిర్డీ వెళ్లొస్తూ మృత్యు ఒడిలోకి..

- కారులో మంటలు చెలరేగడంతో సజీవ దహనమైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు



సురేష్ (ఫైల్)

నల్లగొండ, మాడ్గులపల్లి: షిర్డీ వెళ్లి తిరిగి వస్తుండగా కారులో మంటలు చెలరేగి ప్రభుత్వ ఉపాధ్యాయుడు సజీవ దహనమయ్యాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని ఏచూరి గార్డెన్స్ సమీపంలో నివాసముంటున్న పెంటపల్లి సురేష్‌కుమార్ (48) తన స్నేహితుడితో కలిసి కారులో షిర్డీకి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఆదివారం తెల్లవారుజామున మహారాష్ట్రలోని ఉమ్నాబాద్ జిల్లా వద్దకు రాగానే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్‌తో పాటు సురేష్‌కుమార్ స్నేహితుడు క్షేమంగా బయటపడగా.. సురేష్‌కుమార్ మాత్రం మంటల్లో కాలి సజీవ దహనమయ్యాడు. సురేష్‌కుమార్ నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చెర్వుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అతడి భార్య జ్యోతి వైద్యశాఖలో ఎక్స్‌రే టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారిద్దరు ఇద్దరు డాక్టర్లే కాగా.. కుమార్తె వివాహం అయ్యింది. సురేష్ నల్లగొండలో ఉంటుండగా.. జ్యోతి తన పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. సురేష్ అంత్యక్రియలు సోమవారం నల్లగొండలో నిర్వహించారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్

- కుమారుడు మృతి, తండ్రికి తీవ్ర గాయాలు



జీవన్ (ఫైల్)

మర్కూక్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందగా, తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములర్తి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ములుగు ఎస్‌ఐ దామోదర్ కథనం మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కొండారెడ్డిచెరువు గ్రామానికి చెందిన కర్రె కనకయ్య (33), కుమారుడు కర్రె జీవన్ (13) ఇద్దరూ వ్యాపారం నిమిత్తం కూరగాయలు కొనుగోలు చేసేందుకు బైక్‌పై ములుగు మండలంలోని వంటిమామిడి మార్కెట్‌కు వచ్చారు. కూరగాయలు కొనుగోలు చేసుకొని తిరిగి వెళ్తుండగా మండలంలోని పాములపర్తి గ్రామ శివారులో ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే జీవన్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కనకయ్యను మెరుగైన వైద్యం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



హైదరాబాద్‌లో సోమవారం మాజీ మంత్రి హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, రాంచంద్రనాయక్, బండా నరేందర్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తదితరులు. హరీష్‌రావు బర్త్ డే మంగళవారం కాగా.. నాయకులు ఆయనకు ముందస్తుగానే పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ



జి. తేజశ్రీ



సీహెచ్. హన్సితశ్రీ



జె. మేఘన



టి.అమూల్య



బి.లాస్య



డి.జగదీష్‌రాజు

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలకు చెందిన జి. తేజశ్రీ 1505వ ర్యాంకు, సీహెచ్. హన్సిత శ్రీ 2040, జె. మేఘన 2146, టి. అమూల్య 4877, బి.లాస్య 5766, డి. జగదీష్‌రాజు 8076 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఆయా కేటగిరీల్లో 13 మంది విద్యార్థులు ఐఐటీలతో పాటు జాతీయ స్థాయి కళాశాలల్లో సీట్లు సాధించే అవకాశం ఉందని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

సత్తా చాటిన సర్వేల్ గురుకుల విద్యార్థులు



కొంగరి నిరంజన్

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటారు. ఎస్సీ విభాగంలో కొంగరి నిరంజన్ 1668వ ర్యాంకు సాధించాడు. ఆదేవిధంగా తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో పి. లోకేశ్వర్ 2604వ ర్యాంకు సాధించాడు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ప్రవేశ పరీక్షలో బి. అభినంద్‌రెడ్డి, జి. హర్షిత్‌గుప్తా, ఎస్. సుమిత్, కె. బాలు అర్హత సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సతీష్‌కుమార్ అభినందించారు.

ప్రగతి విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



రమావత్ కృష్ణ



ధనావత్ చరణ్



దోమలపల్లి చరణ్



కల్లేపల్లి సమీరా

నల్లగొండ: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నల్లగొండలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో వివిధ కేటగిరిల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన రమావత్ కృష్ణ 480వ ర్యాంకు, ధనావత్ చరణ్ 1569, దోమలపల్లి చరణ్ 2960, కల్లేపల్లి సమీరా 4122 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు నరేంద్రబాబు, శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందించారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ



ఉత్తర మాడ వీధిలో భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ముఖ మండపం క్యూలైన్, క్యూకాంప్లెక్స్, మాడ వీధులు, ధర్మదర్శనం క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. ధర్మదర్శనానికి 3 గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది. 35వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రూ.43,72,183 నిత్యాదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

చేపల చెరువులో విష ప్రయోగం

- సుమారు 5 టన్నుల చేపలు మృతి
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు

చిలుకూరు: గుర్తుతెలియని వ్యక్తులు చేపల చెరువులో క్రిమిసంహారక మందు కలపడంతో చేపలు మృతిచెందాయి. ఈ ఘటన సోమవారం చిలుకూరు మండలం సీత్లాతండా గ్రామంలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సీత్లాతండా గ్రామానికి చెందిన బానోతు కృష్ణ మూడేళ్ల క్రితం ఉపాధి హామీ పథకంలో తన సొంత పొలంలో 25 గుంటల భూమిలో చేపల చెరువు తవ్వించాడు. ప్రస్తుతం ఆ చెరువులో చేపల పెంపకం చేపట్టాడు. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ చేపల చెరువులో క్రిమిసంహారక మందు కలపడంతో చేపలు మృతిచెందాయి. సోమవారం ఉదయం కృష్ణ చెరువు వద్దకు వెళ్లగా చేపలు మృతిచెంది నీటిపై తేలియాడటం గమనించాడు. ఒక్కో చేప రెండు కిలోల పైనే ఉంటుందని, సుమారు 5 టన్నుల చేపలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. చెరువు ఏర్పాటుకు, చేపల పెంపకం కోసం చాలా డబ్బులు ఖర్చు చేశానని, తనను కావాలనే ఆర్థికంగా దెబ్బతీసేందుకు ఈ పనిచేశారని వాపోయాడు. ఈ ఘటనపై చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు కృష్ణ గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్‌గా పోటీచేశాడు.